





రంజాన్ మాసం వచ్చేసింది..

జిల్లాలో శనివారం రాత్రి నెలవంక కనిపించడంతో ఆదివారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు చేసేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 19°

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత గరిష్టస్థాయిలో నమోదవుతుంది. ఉదయం, రాత్రి మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అలివేలుమంగ, పద్మావతి అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత పల్లకీ సేవ నిర్వహించగా ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఎస్‌ఈగా శ్రీనివాసాచారి



సురేందర్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసాచారి (ఎడమ)

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖ ఖమ్మం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ)గా ఇనుగుర్తి శ్రీనివాసాచారి నియమితులయ్యారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో నలుగురు ఎస్‌ఈలను శనివారం బదిలీ చేయగా మూడేళ్ల నుంచి ఖమ్మం ఎస్‌ఈగా విధులు నిర్వర్తిస్తున్న ఏ.సురేందర్‌కు కూడా స్థానచలనం కలిగింది. ఆయనను హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయానికి జనరల్ మేనేజర్‌గా, అక్కడ జీఎంగా ఉన్న శ్రీనివాసాచారిని ఖమ్మం ఎస్‌ఈగా బదిలీ చేశారు. దీంతో ఆయన ఖమ్మంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, శ్రీనివాసాచారి 2007లో ఖమ్మం రూరల్ ఈస్ట్ ఏడీఈగా విధులు నిర్వర్తించగా, ఆతర్వాత పదోన్నతిపై వివిధ స్థానాల్లో పనిచేసిన ఆయన తిరిగి ఖమ్మం ఎస్‌ఈగా వచ్చారు. ఈసందర్భంగా ఆయనను డీఈలు నంబూరి రామారావు, నాగేశ్వరరావు, బాబూరావు, వెంకటేశ్వర్లు, ఎస్‌ఏఓ శ్రీధర్, ఏడీఈలు, ఏఈలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాక యూనియన్ల ప్రతినిధులు మందపాటి సత్యనారాయణ రెడ్డి, సీతారాం గోపాల్, ఎం.ప్రసాద్, నాగేశ్వరరావు, సురేష్, శ్రీనివాస్, శ్రీధర్, కృపాకర్ కూడా ఎస్‌ఈని కలిశారు.

10లోపు ఇందిరమ్మ లబ్ధిదారులకు మొదటి బిల్లు



ఇంటి నమూనాపై అవగాహన కల్పిస్తున్న పీడీ శ్రీనివాస్

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు మొదలుపెట్టాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని కొంగరలో లబ్ధిదారులతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచనల మేరకు 400 – 500 చదరపు గజాల్లో ఇంటి నిర్మాణం చేపడితే ఇబ్బందులు ఉండవని తెలిపారు. జనవరి 26న పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించిన గ్రామాల్లోని లబ్ధిదారులు తొలుత ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని, వీరికి ఈనెల 10లోగా తొలి బిల్లు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బేస్‌మెంట్, గోడల నిర్మాణం తర్వాత రూ.లక్షల చొప్పున, స్లాబ్ వేశాక రూ.2లక్షలు, మొత్తం ఇల్లు సిద్ధమయ్యాక మరో రూ.లక్ష అందుతాయని తెలిపారు. ఈసమావేశంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, పీఆర్ ఏఈ ప్రసాద్, మార్కెట్ డైరెక్టర్ అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు ఆగడం లేదు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాల్లోని స్కానింగ్ సెంటర్లపై నిఘా పెరగడంతో కొందరు ఆర్‌ఎంపీలు నేరుగా పల్లెలకు వెళ్తూ దందాకు తెరలేపారు. వాహనాల్లో అల్ట్రాసౌండ్ మిషన్లు, ఇతర పరికరాలతో వెళ్లి తమను సంప్రదించిన వారి ఇళ్లలోనే గర్భిణులకు పరీక్షలు చేస్తున్నారు. వీరి ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వసూలు చేస్తున్నారు. కేవలం స్కానింగ్ కేంద్రాలపైనే నిఘా వేసిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఇతరచోట్ల తనిఖీలు చేపట్టకపోవడంతో ఆర్‌ఎంపీల వ్యాపారం జోరుగా సాగుతోంది. రెండు రోజుల క్రితం చింతకాని మండలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఆర్‌ఎంపీలు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న అంశం బట్టబయలైంది. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం



మీ ఇంటికే మేమొస్తాం..

స్కానింగ్ కేంద్రాలపై నిఘాతో అక్రమార్కుల కొత్తదారి

- జిల్లాలో యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు
- వాహనాల్లో యంత్రాలతో వెళ్తున్న ఆర్‌ఎంపీలు
- స్కానింగ్‌కు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వసూళ్లు

అక్రమార్జనే ధ్యేయం

లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా కడుపులో పెరుగుతున్నది ఆడా, మగా అని తెలుసుకుంటున్న కొందరు ఆడపిల్ల అని తేలితే కడుపులోనే చిదిమేస్తున్నారు. దీంతో ప్రభుత్వం 'గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ(నియంత్రణ, దురుపయోగ నివారణ) చట్టాన్ని 1994లో తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని 2003లో సవరించి 'గర్భధారణ పూర్వ గర్భస్థ పిండ ప్రక్రియ '(లింగ ఎంపిక నిషేధం) గా మార్చారు. దీని ప్రకారం డీఎంహెచ్‌ఓ అనుమతి ఉన్న సెంటర్లలోనే అవసరమైన గర్భిణులకే పరీక్షలు చేయాలి. కానీ అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా యథేచ్ఛగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. పలు స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రుల్లో ఈ పరీక్షలు జరుగుతున్నా ఫిర్యాదు అందితేనే వైద్య, ఆరోగ్య శాఖ తనిఖీలు చేపడుతోంది. ఈక్రమాన కొన్నాళ్ల క్రితం స్కానింగ్ చేయడంతో పాటు అబార్షన్లు చేసిన విషయమై గత ఏడాది జిల్లాలో నాలుగు ఆస్పత్రులను సీజ్ చేశారు. దీంతో కొన్నాళ్లు అంతా సద్దుమణిగిందని భావిస్తుండగా అనుమతి లేకుండానే కొందరు సెంటర్లు తెరిచి స్కానింగ్ నిర్వహిస్తున్నారని తెలుస్తోంది.

ఆర్‌ఎంపీలదే హవా

జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఆర్‌ఎంపీలను మధ్యవర్తులుగా నియమించుకుంటున్నారు. జిల్లా నుంచే కాక పక్క జిల్లాల్లోనూ వీరి ద్వారా చికిత్స కోసం పంపిస్తే భారీ ఎత్తున కమీషన్లు ముట్టజెప్పుతున్నారు. అయితే, ఇంతకు మించి ఆదాయం కోసం కొందరు ఆర్‌ఎంపీలు నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కుమార్తె ఉన్న వారు మరోమారు గర్భం దాలిస్తే పుట్టబోయేది ఆడా, మగా అని తెలుసుకునేందుకు పలువురు లింగనిర్ధారణ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అయితే, ఆస్పత్రులపై నిఘా ఉండడంతో ఆర్‌ఎంపీలు వాహనం సమకూర్చుకుని అందులో ఆర్‌ఎంపీతో పాటు టెక్నీషియన్, పరికరాలతో గ్రామాలకు వెళ్లి పరీక్షలు చేస్తుండడం గమనార్హం. ఇలా ఇంటికే వచ్చి స్కానింగ్ చేసినందుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

టాస్క్‌ఫోర్స్ నిఘాతో..

ఖమ్మంకు చెందిన ల్యాబ్‌టెక్నీషియన్, బల్లేపల్లి, చింతకాని మండలం కొదుమూరుకు చెందిన ఆర్‌ఎంపీ జట్టుగా ఏర్పడి కారులో అల్ట్రాసౌండ్ పరికరంతో జిల్లాతో పాటు భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట, మహబుబాబాద్ జిల్లాల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిసింది. నేరుగా పట్టణాల్లోని కేంద్రాలకు వెళ్తే స్కానింగ్ చేయరని నమ్మబలుకుతూ వీరు గ్రామాల్లో తిరుగుతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా వేశారు. గత నెల 27న ఈ బృందం కొదుమూరులో గర్భిణులకు స్కానింగ్ చేస్తుండగా పట్టుకుని వాహనం, యంత్రాన్ని సీజ్ చేయగా చింతకాని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.



కొదుమూరులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న అల్ట్రాసౌండ్ మిషన్

అబార్షన్ కూడా చేయిస్తాం..

గ్రామాల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న సదరు ఆర్‌ఎంపీలు అబార్షన్‌కు సిద్ధమవుతున్న వారిని ఎంపిక చేసిన ప్రైవేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆస్పత్రుల నుంచి అదనంగా కమీషన్ తీసుకుంటున్నట్లు తెలిసింది. స్కానింగ్ ద్వారా కడుపులో పెరుగుతున్నది ఆడ శిశువు అని తేలితే కొందరు గర్భస్రావానికి మొగ్గు చూపుతుండడం ఆర్‌ఎంపీలకు కలిసొస్తోంది. కాగా, ఆర్‌ఎంపీల దందాకు ఇల్లెందుకు చెందిన ఓ ప్రైవేట్ వైద్యుడి సహకారం ఉన్నట్లు సమాచారం. సదరు వైద్యుడు పోలీసులకు చిక్కితే ఎక్కడెక్కడ, ఎవరెవరికి స్కానింగ్ చేశారు, అందులో ఎవరికైనా అబార్షన్ చేయించారా అన్నది తేలనుంది.

ఉగాదికల్లా మండలానికి కృష్ణా జలాలు



పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

'మంచుకొండ' పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

రఘునాథపాలెం: చైతన్యవంతులైన గిరిజనులు నివసిస్తున్న ప్రాంతంలో మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందుబాటులోకి వస్తే అటు ఉద్యాన పంటలు, ఇటు ఆయిల్ పామ్ సాగు పెరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈనేపథ్యాన వచ్చే ఉగాది పండుగలోగా ఎత్తిపోతల పథకం ద్వారా మండలానికి కృష్ణా జలాలను అందించేలా పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని సాగర్ ప్రధాన కాల్వపై నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులను శనివారం ఆయన పరిశీలించి అధికారులతో సమీక్షించారు. పంటల కోతలు పూర్తికాని చోట రైతులకు సమయం ఇవ్వాలని, ఆపై పైపులైన్ పనులు చేపట్టాలని తెలిపారు. ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.66 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ పథకం పూర్తయితే 36చెరువులకు సాగునీరు అందుతుందని వెల్లడించారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాదు రమేష్‌రెడ్డి, వాంకుడోత్ దీప్లానాయక్, బాలా జీనాయక్, తాతా రఘురాం, కె.నాగేశ్వరరావు, బండి నాగేశ్వరరావు, రామునాయక్, బండి వెంకన్న, గుడిపూడి రామారావు, చెరుకూరి పూర్ణ, మందా బుచ్చిబాబు, బాణోత్ కోటేష్ నాయక్, తేజావత్ వెంకన్న, భూక్యా మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా దరఖాస్తుల పరిష్కారం

- అవకతవకలు తేలితే బాధ్యులపై చర్యలు
- అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ, పక్కన శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పెండింగ్ ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈమేరకు నెలాఖరులోగా స్క్రూటినీ, పరిష్కారం పూర్తి కావాలని తెలిపారు. కలెక్టరేట్ నుంచి శనివారం వారు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతీ బృందంలో నీటి పారుదల శాఖ, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ భూములు, నీటి వనరుల పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భూములు ఉంటే తిరస్కరించాలని సూచించారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాకే ధ్రువీకరించాలని, ఇందులో అవకతవకలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతేకాక ఆమోదించిన దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తూ ఫీజు రాయితీ వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఈసమావేశంలో డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ రాంబాబు, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ షఫీయుల్లా, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు

ప్రతీ దివ్యాంగుడికి యూడీఐడీ నంబర్ కేటాయించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. సెర్ప్ సీఈఓ డి.దివ్య హైదరాబాద్ నుంచి శనివారం యూనిక్ డిజేబిలిటీ ఐడీ(యూడీఐడీ) జారీ, సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా జిల్లా నుంచి అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ అనంతరం ఆమె జిల్లా అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. జిల్లా ఆస్పత్రి, డీఆర్‌డీఓలోని డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మీ సేవా కేంద్రాల నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలకు యూడీఐడీ దరఖాస్తుల నమోదుపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇకపై దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లకు బదులుగా కార్డులు జారీ చేయనుండగా, ఇతర రాష్ట్రాలలోనూ ఇవి ఉపయోగపడతాయనే అంశంపై ప్రచారం చేయాలని సూచించారు. గతంలో సర్టిఫికెట్ ఉన్నవారికి డీఆర్‌డీఓ ద్వారా నంబర్ కేటాయిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న కేఎంసీ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక సంవత్సరంలో నెల మాత్రమే మిగిలి ఉన్నందున ఆస్తి, పంపు పన్నులు వంద శాతం వసూలు చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందితో శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమైన ఆయన రోజువారీ పన్నుల వసూళ్లపై ఆరా తీశారు. ముప్పై రోజుల గడువే ఉన్నందున ప్రతిరోజు ఉదయం 8నుంచి సాయంత్రం 6గంటల వరకు సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఉండి వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వారి వద్దకు అధికారులు వెళ్లి రెడ్ నోటీసులు జారీచేయాలని, అవసరమైతే సీజ్ చేయాలని సూచించారు. అలాగే, వసూళ్ల కోసం రెవెన్యూ వార్డుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, ఆటోలకు మైకుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.36 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.22 కోట్లు వసూలైనందున మిగతా పన్నులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ అభిషేక్ సూచించారు. కాగా, పన్నుల విషయమై ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే రెవెన్యూ మేళాలో దరఖాస్తు చేసుకోవాలని, తద్వారా వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.

పాలేరు ప్రజలకు ఇక మెరుగైన వైద్యం

కూసుమంచిలో వంద పడకల ఆస్పత్రికి నిధులు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గ ప్రజలకు ఇకపై మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో కూసుమంచిలో వంద పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. పరిపాలనా అనుమతుల్లో భాగంగా రూ.45.50 కోట్లు మంజూరు చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ సెక్రటరీ క్రిస్టియానా జడ్.చోంగ్తూ పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యాన నిర్మించే వంద పడకల ఆస్పత్రి పనులకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. మండలంలోని గట్టుసింగారం రెవెన్యూలో కస్తూర్బా పాఠశాల సమీపాన ఆస్పత్రిని నిర్మాణానికి గతంలో భూమి కేటాయించారు.

సాగునీరు అందుతోందా?

వైరారూరల్: మండలంలోని వల్లాపురంలో పలువురు రైతులు సాగర్ ఆయకట్టు కింద సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలను శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య పరిశీలించారు. సాగర్ కాల్వలో నీటి లభ్యతపై ఆయన ఆరా తీశారు. అయితే, మొక్కజొన్న కంకి పాలు పోసుకునే దశకు చేరిన నేపథ్యాన వారబందీ విధానంలో విడుదల చేసే నీరు సరిగా అందక ఇబ్బంది అవుతోందని రైతులు తెలిపారు. కాగా, రైతులు నీటిని పొదుపుగా వాడుకుంటూ పంటలను కాపాడుకోవాలని డీఏఓ సూచించారు. ఏడీఏ తుమ్మపల్లి కరుణశ్రీ, ఏఓ మయాన్ మంజుఖాన్, ఏఈఓలు సపావత్ సైదులు, మేడా రాజేష్, రైతు తుమ్మల రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



కంకులను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

పందిళ్లపల్లి రైల్వే గూడ్స్‌షెడ్‌కు మోక్షం

కార్మికుల సమస్య పరిష్కారమైతే ఎరువుల దిగుమతి

చింతకాని: చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే స్టేషన్‌లో ఎరువుల దిగుమతి కోసం గూడ్స్ షెడ్ సిద్ధమైంది. దీంతో జిల్లాకు ఎరువుల రవాణా సులువు కానుంది. మూడో రైల్వే లైన్ ఏర్పాటుతో గత జనవరిలో ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఉన్న గూడ్స్ షెడ్‌ను తొలగించి పందిళ్లపల్లి స్టేషన్‌కు మార్చారు. కానీ సాంకేతిక కారణాలతో కొత్త గూడ్స్ షెడ్ ద్వారా ఎరువుల దిగుమతి మొదలుకాకపోవడంతో మిర్యాలగూడ, వరంగల్ రేక్ పాయింట్ల నుండి ఎరువులను తెప్పించి సొసైటీలు, ఆగ్రోస్ కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేశారు. ఈక్రమంలో ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల రైతులకు ఇక్కట్లు ఎదురయ్యాయి. ఇంతలోనే ఇంటిగ్రేటెడ్ ఎరువుల నిర్వహణ వ్యవస్థ(ఐఎఫ్ఎంఎస్) ద్వారా పందిళ్లపల్లి షెడ్‌కు రైల్వే వ్యాగన్లలో ఎరువుల సరఫరాకు వివిధ కంపెనీలకు అనుమతి జారీ చేయడంతో సమస్య పరిష్కారమైనట్లయింది.

రంగంలోకి రెండు ప్రాంతాల కార్మికులు

పందిళపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్ నుంచి ఎరువులను సరఫరా చేయడానికి లారీ యజమానుల అసోసియేషన్ బాధ్యులు ముందుకొచ్చి హ్యాండ్లింగ్ కాంట్రాక్టర్‌కు హామీ ఇవ్వడంతో ఆ సమస్య తీరింది. ఇదిలా ఉండగా పందిళ్లపల్లి గూడ్స్ షెడ్‌లో పనిచేసేందుకు పరిసర ప్రాంతాల కార్మికులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇక్కడ ఎగుమతి, దిగుమతులను తక్కువ ధరకే చేస్తామని కాంట్రాక్టర్‌కు హామీ పత్రం అందజేశారు. ఇంతలోనే ఖమ్మం గూడ్స్ షెడ్‌లో పనిచేసిన కార్మికులు సైతం తామే ఇక్కడ పనిచేస్తామని, కొత్తవారిని తీసుకోవద్దని కోరారు. ఈఅంశం రాజకీయ నాయకుల జోక్యంతో తీవ్రం కాగా వైరా పోలీస్ సర్కిల్ కార్యాలయానికి చేరింది. అధికారులు సమస్యను పరిష్కరిస్తే త్వరలోనే వ్యాగన్ల ద్వారా ఎరువుల దిగుమతి మొదలుకానుంది.

టాటా అల్ట్రా మారథాన్‌లో పతకం



కానిస్టేబుల్ రాజును అభినందిస్తున్న సీపీ, అధికారులు

ఖమ్మంక్రైం: ప్రతిష్టాత్మక 50కి.మీ. టాటా అల్ట్రా మారథాన్‌లో ఖమ్మంకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ పిల్లి రాజు పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఆయనను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శనివారం సత్కరించారు. గతనెల 23వ తేదీన పుణే సమీపంలోని లోన్‌వాలా సయ్యాద్రి కొండలపై సముద్ర మట్టానికి 2,400 అడుగుల ఎత్తులో అర్ధరాత్రి వేళ ఈ మారథాన్ పూర్తి చేసినట్లు రాజు తెలిపారు. ఈమేరకు సీపీతో పాటు అదనపు డీసీపీలు ప్రసాద్‌రావు, నరేష్‌కుమార్, కుమారస్వామి, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, అప్పలనాయుడు తదితరులు ఆయనను అభినందించారు.

క్లుప్తంగా

అనుచరుడి పాడె మోసిన మంత్రి తుమ్మల



సత్యం పాడె మోస్తున్న మంత్రి తుమ్మల, తదితరులు

సత్తుపల్లి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అనుచరుడు, మాజీ జెడ్పీటీసీ గాదె సత్యనారాయణ(79) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందగా శనివారం సత్తుపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించే సమయాన మంత్రి కన్నీటి పర్యంతమయ్యారు. ఆతర్వాత అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, కూసంపూడి మహేష్, దొడ్డా శంకర్‌రావు, చలసాని సాంబశివరావు, ఉడతనేని అప్పారావు, ఎం.డీ.కమల్‌పాషా, పసుమర్తి చందర్‌రావు కూడా సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

గవర్నర్‌ను కలిసిన టీడీసీఏ బాధ్యులు



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీసీఏ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(టీడీసీఏ) బాధ్యులు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో కలిశారు. ఈసందర్భంగా త్వరలో జరగనున్న అమెరికా–ఇండియా అండర్–17 క్రికెట్ టోర్నీ పోస్టర్లను గవర్నర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీసీఏ బాధ్యులతో పాటు అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఎం.డీ.మతిన్ సైతం పాల్గొన్నారు.


ఇరుకు దారిలో ప్రమాదం, స్తంభించిన ట్రాఫిక్



రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్ వద్ద శనివారం కారును లారీ ఢీకొట్టగా ఇరుకు దారి కావడంతో గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. హైదరాబాద్ వైపు నుండి ఖమ్మం వస్తున్న కారును ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టి రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. కాగా, మున్నేరు వద్ద తీగల వంతెన నిర్మాణ పనులు జరుగుతుండగా, మూడు నెలల క్రితం మున్నేటి పాత బ్రిడ్జిపై నుండి సైతం రాకపోకలు నిలిపేశారు. దీంతో ప్రత్యామ్నాయంగా మున్నేటి బిడ్జి కింది నుండి తాత్కాలికంగా సింగిల్ రోడ్డు వేయగా ఈ రహదారిపై ప్రమాదం జరగడంతో రెండు వైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు చేరుకుని లారీని పక్కకు తీయించి, ఖమ్మం నుండి జలగంనగర్ వైపు వచ్చే వాహనాలను ఎంపీడీఓ కార్యాలయం పక్క నుండి మళ్లించారు. దీంతో రెండు గంటల పాటు వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

వసతులు లేని పాఠశాలల పరిశీలన



లక్ష్మీపురంలో పరిశీలిస్తున్న రామకృష్ణ, తదితరులు

ఎర్రుపాలెం: మండలంలోని చొప్పకట్లపాలెం, లక్ష్మీపురం, కొత్తగోపవరం తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను శనివారం విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో ఉన్న వసతులు, ఇంకా సమకూర్చాల్సిన వసతులపై సమీక్షించి ఎంఈఓ బి.మురళీమోహన్‌రావుకు సూచనలు చేశారు. వచ్చే విద్యా సంవత్సరం మొదలయ్యే నాటికి పనులు పూర్తిచేయాల్సి ఉంటుందని తెలిపారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్ మారాబత్తుల లింగయ్య పాల్గొన్నారు.

జాతర వద్ద చిందులకు ఏర్పాట్లు?

ఖమ్మం అర్బన్: ఖమ్మం దంసలాపురంలో మహ శివరాత్రి జాతరకు సమీపాన శుక్రవారం రాత్రి అశ్లీల పాటలకు నృత్యాలు చేసేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఈమేరకు అందిన సమాచారంతో ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్, సిబ్బంది వెళ్లగా ఏపీకి చెందిన కళాకారులు, నిర్వాహకులు పారిపోయినట్లు సమాచారం. దీంతో నిర్వాహకులను స్టేషన్‌కు పంపించాలని సీఐ సూచించినట్లు తెలిసింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

రంజాన్ మాసం వచ్చేసింది..

- జిల్లాలో కనిపించిన నెలవంక
- నేటి నుంచి ముస్లింల ఉపవాస దీక్షలు

సత్తుపల్లి: పవిత్ర రంజాన్ మాసం వచ్చేసింది. శనివారం రాత్రి జిల్లాలో నెలవంక కనిపించడంతో ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ ఉపవాస దీక్షలను ఆదివారం నుంచి ఆచరించనున్నారు. ఈ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించినట్లు నమ్మే ముస్లింలు.. ఉపవాస దీక్ష చేపట్టడంతో పాటు నెలంతా ఖురాన్ పఠనంలో గడుపుతారు. కాగా, నెలవంక కనిపించగానే ముస్లింలు పరస్పరం 'చాంద్ ముబారక్' చెప్పుకుని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అలాగే, మసీదులను విద్యుత్‌లైట్లతో అలంకరించి దీక్షాపరుల కోసం ఇతర ఏర్పాట్లుచేశారు.

ఆకలి బాధలు అనుభవంలోకి...

ముప్పై రోజుల ఉపవాస దీక్ష ఆచరించిన వారికి అల్లా అనుగ్రహం లభిస్తుందని ముస్లింల విశ్వాసం. అంతేకాక ఉపవాసం ద్వారా పేదల ఆకలి బాధలు అనుభవంలోకి వస్తాయని, తద్వారా పేదలను ఆదుకునేలా స్ఫూర్తి కలుగుతుందని చెబుతారు. ఈ నెలలో చేసే ఏ పుణ్యకార్యమైనా డెబ్బై రెట్లు పుణ్య ఫలాన్ని ఇస్తుందని నమ్ముతారు. రోజా(ఉపవాసం) ఆచరిస్తున్నప్పుడు చెడు మాట్లాడకుండా, చెడు ఆలోచనలు మాని నిత్యం అల్లా స్మరణలో ఉంటారు.

ఉపవాస దీక్షలు ఇలా..

పేద, ధనిక అనే వ్యత్యాసం లేకుండా ముస్లింలంతా ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. సూర్యకిరణాలు పడకముందే అన్నపానీయాలు పూర్తి చేసి దీక్ష మొదలుపెట్టి, సూర్యాస్తమయ సమయాన విరమిస్తారు. తెల్లవారుజామున 5.10 గంటల సమయంలో ఉపవాస దీక్ష ప్రారంభమైన సాయంత్రం 6.21 గంటలకు ఉంటుంది. కొన్నిచోట్ల ఈ సమయంలో 5–7నిమిషాల వ్యత్యాసం ఉంటుంది.

తరావీహ నమాజ్ ప్రత్యేకం

రంజాన్ నెల పొడుపు కన్పించగానే ప్రతిరోజు ఇషా నమాజ్ తర్వాత 'తరావీహ' నమాజ్ ఆచరిస్తారు. కేవలం రంజాన్ నెలలోనే ఈ నమాజ్ చేస్తారు. రాత్రి 8–30నుంచి 10గంటల వరకు తరావీహ నమాజ్‌ను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. రోజేదార్(ఉపవాస దీక్షాపరుడు) ఖురాన్ విన్నా చదివినంత పుణ్యఫలం వస్తుందని ముస్లింల విశ్వాసం.

దానధర్మాలు

రంజాన్ మాసంలో జకాత్, ఫిత్రాహ్, సథఖహ్ చేస్తారు. ప్రతీ ముస్లిం రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలనే భావనతో దానధర్మాలను చేస్తారు. ఇదే నెల చివరి వారంరోజుల్లో ఫిత్రా ఇస్తారు. కుటుంబంలో ప్రతిఒక్కరిపై ఫిత్రా విధిగా నిర్ణయించబడుతుంది. పండుగ రోజు పుట్టిన బిడ్డకు సైతం చెల్లించాల్సిందే. 'ఫిత్రా' విలువను 1.75 కిలోల గోధుమల ధరతో లెక్కిస్తారు. అలాగే, జకాత్ (విధి దానం) చెల్లించాల్సి ఉంటుంది. ఏడున్నర తులాల బంగారం, 52.50 తులాల వెండి కలిగిన ప్రతీ ముస్లిం జకాత్ ఇవ్వాలని చెబుతారు. జకాత్‌ను పేదలకు, అనాథ పిల్లలు మదర్సాలకు అందజేస్తారు. సంపాదనలో కొంత సొమ్మును 'సథఖహ్' కింద బంధువుల్లో నిరుపేదలకు ఇస్తారు.



విద్యుత్ లైట్ల వెలుతురులో సత్తుపల్లిలోని మసీద్

మసీద్‌ల వద్ద ఏర్పాట్లు



మసీద్ వద్ద శుభ్రం చేయిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: రంజాన్ మాసం ఆదివారం నుంచి మొదలుకానున్న నేపథ్యాన మసీదులు, ఈద్గాల వద్ద కేఎంసీ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. దీంతో నగరంలోని మసీదుల చుట్టూ వ్యర్థాలు, పిచ్చి మొక్కలను శనివారం డోజర్ల ద్వారా తొలగించారు. అలాగే, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు.

రంజాన్ విశిష్టత

రంజాన్ నెలను మూడు భాగాలుగా విభజిస్తారు. మొదటి పదిరోజులు రహమత్‌కే రోజాలు(కరుణ కురిపించే), రెండో పది రోజులు మగఫిరత్‌కే రోజాలు(పాపాల నుంచి క్షమాపణ పొందే దినాలు)లుగా, చివరి పది రోజులను జహన్నుమ్‌సే ఝూట్‌కారే రోజాలు(నరకదండన నుంచి విముక్తి కోరే దినాలు)గా పిలుస్తారు. ఈ చివరి పది రోజులు ఇతెఖాఫ్(మసీద్‌లో అల్లా నామ స్మరణతో గడపడం) పాటిస్తారు.

హలీం బట్టీలు రెడీ

సత్తుపల్లిటౌన్: పవిత్ర రంజాన్ మాసం ఆదివారం నుంచి మొదలుకానుంది. దీంతో ఉపవాస దీక్ష చేపట్టే ముస్లింలు సాయంత్రం విరమణ తర్వాత తక్షణ శక్తి కోసం హలీం తినడానికి మొగ్గు చూపుతారు. అంతేకాక రంజాన్ మాసంలో మాత్రమే లభించే హలీంను ఇతర మతాల వారూ తినాలని ఆసక్తి కనబరుస్తారు. దీంతో సత్తుపల్లిలోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రానికి బట్టీలు సిద్ధం చేశారు.



సత్తుపల్లిలో సిద్ధమైన హలీం బట్టి

రంజాన్ స్ఫూర్తిని నింపుతుంది..



రంజాన్ మాసంలో చేపట్టే ఉపవాస దీక్షలు స్ఫూర్తిని నింపుతాయి. ఆకలి, దప్పిక విలువ తెలుస్తుంది. ఈ నెలంతా పండుగ వాతావరణం ఉంటుంది. రంజాన్ ఉపవాస దీక్షాదారులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

– నాయబ్ రసూల్, జామేమసీద్ సదర్, సత్తుపల్లి

14ఏళ్లు నిండిన వారి విధి..



ముస్లింలో 14ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఉపవాస దీక్ష విధిగా నిర్ణయించబడింది. ఉపవాస దీక్షల్లో నిష్టతో ఉండడమే కాక అల్లా నామ స్మరణలో గడపాలి. నెలరోజుల ఉపవాస దీక్ష ఆచరించడం ద్వారా సర్వపాపాలు హరిస్తాయని విశ్వాసం.

– అబ్దుల్ అలీం, జామే మసీద్, సత్తుపల్లి

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

అధికారులకు ఐటీడీఏ పీఓ ఆదేశం



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం భోజనం సమకూరుస్తూనే వ్యక్తిగత ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఉద్యోగులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన పాఠశాలల హెచ్‌ఎంలు, వార్డెన్లు, ఏఎన్‌ఎంలకు భద్రాచలం బీఈడీ కళాశాలలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు అప్రమత్తంగా ఉంటూ పిల్లల ఆరోగ్యాన్ని గమనించాలని, ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ప్రత్యేక గది ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయించాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై సమీప పీహెచ్‌సీల వైద్యులతో నెలకోసారి అవగాహన సదస్సు నిర్వహించాలని సూచించారు. కిశోర బాలికలకు మహిళా వైద్యులతో అవసరమైన కౌన్సెలింగ్ ఇప్పించాలన్నారు. అన్ని పాఠశాలలకు త్వరలోనే మెడికల్ కిట్లు అందిస్తామని పీఓ వెల్లడించారు.

ఎస్సెస్సీలో వంద శాతం ఫలితాలే లక్ష్యం..

పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యాన వెనకబడిన విద్యార్థులకు రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, హెచ్‌ఎంలు, వార్డెన్లు, సబ్జెక్ట్ టీచర్లు పాఠశాలల్లోనే రాత్రి బస చేయాలని పీఓ రాహుల్ ఆదేశించారు. ప్రీ ఫైనల్ పరీక్షల జవాబు పత్రాలు దిద్దే సమయాన విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి మరింత మెరుగుపడేలా సూచనలు చేయాలని తెలిపారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూనే ఆహారం, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, ఏసీఎంఓ రమణయ్య, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరూనాయక్, హెల్త్ కమాండ్ సెంటర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య, ఏటీడీఓలు అశోక్ కుమార్, జహీరుద్దీన్, చంద్రమోహన్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత 'విజయవాడ'



విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఎర్రుపాలెం: మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని బనిగండ్లపాడు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతగా ఏపీలోని విజయవాడ సాయి సెంటర్ జట్టు నిలిచి రూ.25వేలు, ఖమ్మం అకాడమీ జట్టు రెండో స్థానంలో నిలిచి రూ.20వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. అలాగే, మూడు నుంచి ఆరో స్థానం వరకు బనిగండ్లపాడుకు చెందిన పెద్దమళ్ల వెంకటేశ్వర్లు మెమోరియల్ జట్టు, వై.కే.రెడ్డి రాజుల దేవరపాడు, బనిగండ్లపాడు జీవీకే ఈవెంట్స్, బనిగండ్లపాడు గణేష్ మార్కెట్ జట్లు నిలవగా నగదు బహుమతులు అందజేశారు. మధిర మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, శివాలయం వ్యవస్థాపకులు ఐలూరి అంకిరెడ్డి –విజయలక్ష్మితో పాటు యరమల పూర్ణచంద్రారెడ్డి, గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి, పెద్దమళ్ల మోహన్‌రావు విజేతలకు బహుమతులు అందజేయగా అర్చకులు కాశవఝల నర్సింహమూర్తితో పాటు ,అనుమోలు కృష్ణారావు, యన్నం సత్యనారాయణరెడ్డి, శీలం ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి మాజీ సర్పంచ్ రూ.5లక్షల విరాళం

అశ్వాపురం: మండలంలోని మొండికుంటలో నిర్మాణం పూర్తయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు సిద్ధమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగానే మాజీ సర్పంచ్, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి–సంధ్యారాణి దంపతులు శనివారం రూ.5 లక్షల విరాళం అందజేశారు.

మొండికుంట గ్రామస్తుల చిరకాల కోరిక అయిన రామాలయ నిర్మాణాన్ని పూర్తిచేయడంలో చొరవ చూపడమే కాక విరాళం అందించిన మల్లారెడ్డికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

శివరాత్రి జాతరల ఆదాయం లెక్కింపు

మృత్యుంజయ స్వామి ఆలయానికి రూ.32.78లక్షలు



వైరా రూరల్ : ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు

మధిర: మధిరలోని మృత్యుంజయ స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా జరిగిన జాతరకు సంబంధించి ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3.80 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ జగన్మోహన్‌రావు వెల్లడించారు. అలాగే, జాయింట్ వీల్, దుకాణాల ఏర్పాటు, కొబ్బరిచిప్పల సేకరణ, ప్రసాదాల అమ్మకం, కల్యాణ కట్నాలు, పూజల టికెట్ల అమ్మకంతో కలిపి రూ 32.78 లక్షల ఆదాయం నమోదైందని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ.3.52 లక్షల ఆదాయం పెరిగిందని ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాధ, అర్చకులు రాయప్రోలు సత్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్నానాల లక్ష్మీపురంలో రూ.9.47లక్షలు

వైరారూరల్: వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.3,55,450 సమకూరగా, టికెట్ల అమ్మకంతో రూ.2,99,840, దుకాణాల వేలం ద్వారా రూ. 83,350, మిఠాయి షాపుల ద్వారా రూ.50వేలు, ప్రసాదాల అమ్మకంపై రూ.1,39,500, కొబ్బరిచిప్పల వేలంతో రూ.19వేలతో పాటు కల్యాణ కట్న కానుకలు కలిపి రూ.9,47,564 ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు. ఈకార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కె.వేణుగోపాలచార్యులు, ఈఓ హరిబ్రంద శేఖర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దొడ్డా ఉషారాణితో పాటు దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, నూతి వెంకటేశ్వర్లు, మొగుసూరు సత్యనారాయణ, మల్లు శేషమ్మ, సుల్తాన్ పద్మా, తలారి నర్సింహారావు, సంగేపు రామకృష్ణ, గిరగాని శ్రీనివాసరావు, మైబ్‌జానీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటిలింగాల జాతరకు రూ.3.54లక్షలు

కారేపల్లి: మహా శివరాత్రి సందర్భంగా కారేపల్లి మండలం బుగ్గవాగు ఒడ్డున శ్రీ కోటిలింగాల ఆలయంలో నిర్వహించిన జాతర ఆదాయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు శనివారం ప్రకటించారు. హుండీలో భక్తులు రూ.92,825 సమర్పించగా, కొబ్బరికాయల షాపు వేలం ద్వారా రూ.90వేలు, కొబ్బరిచిప్పల వేలంతో రూ.22వేలు, లడ్డూల అమ్మకం ద్వారా రూ.20వేలు, దర్శన టికెట్ల ద్వారా రూ.1,29,430 కలిపి రూ.3,54,255 ఆదాయం వచ్చిందని తెలిపారు. అయితే, జాతర ఏర్పాట్లకు రూ.3,82,082 ఖర్చు కావడంతో రూ.27,827 లోటు నమోదైందని వెల్లడించారు. గత ఏడాది రూ.50వేలు మిగలగా, ఈసారి భక్తుల సంఖ్య తగ్గటంతో ఆదాయం సైతం తగ్గిందని భావిస్తున్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య



అగ్గిరాములు (ఫైల్)

చింతకాని: మండలంలోని చిన్నమండవకు చెందిన తుపాకుల అగ్గిరాములు(43) అప్పుల బాధతో శుక్రవారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన గత నాలుగేళ్లగా కుటుంబ అవసరాలకు అప్పులు చేయగా అవి పెరగడంతో తీర్చే మార్గం లేక మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి భార్యాపిల్లలు నిద్రించాక ఇంటి వరండాలోని రేకుల షెడ్ పైప్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. తెల్లవారుజామున నిద్రలేచిన భార్య ఈ విషయాన్ని గమనించి స్థానికులను పిలవగా పరిశీలించే సరికి అగ్గిరాములు మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య ప్రభావతి శనివారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రోడ్డు రోలర్ చోరీపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు రోలర్ చోరీ జరిగిందని ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురానికి చెందిన భిక్షం రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. ఏదులాపురానికి చెందిన భిక్షంరెడ్డి వద్ద రోడ్డు రోలర్ అద్దెకు తీసుకునేందుకు ఫిబ్రవరి 23న ముగ్గురు సంప్రదించారు. రూ.35 వేల అద్దెతో ఒప్పందం కుదరగా రూ.25వేలు పంపించారు. దీంతో ఆయన అదేరోజున వాహనాన్ని డ్రైవర్ అఫ్జల్‌తో మహబూబాబాద్ పంపించాడు. అయితే, ఆర్‌ఓబీ ప్రాంతంలో డ్రైవర్ వాహనాన్ని నిలపగా మరుసటి రోజు ఉదయంకల్లా కనిపించలేదు. ఈమేరకు ఫిబ్రవరి 25న మహబూబాబాద్ చేరుకున్న భిక్షంరెడ్డికి పాత ఇనుప సామాన్ల దుకాణం సమీపాన రోడ్డు రోలర్ కనిపించడంతో ఆరా తీయగా రూ.2.19 లక్షలకు ఓ వ్యక్తి విక్రయించాడని షాపు నిర్వాహకులు తెలిపారు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.



మూడు బియ్యం లారీలు సీజ్

కాకినాడ పోర్ట్‌కు తరలిస్తుండగా అడ్డుకున్న పోలీసులు



సీజ్ చేసిన బియ్యం లారీల వద్ద అధికారులు

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా రాష్ట్ర సరిహద్దు, ఆపై దేశం దాటించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తుండగా.. మూడు బియ్యం లారీలను అశ్వారావుపేట ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్ద అధికారులు శనివారం అడ్డుకున్నారు. రాష్ట్రంలోని కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల నుంచి ఏపీలోని కాకినాడ పోర్ట్‌కు 12బియ్యం లారీలు బయలుదేరాయి. అనుమానంతో అసిస్టెంట్ సివిల్ సప్లయీస్ అధికారి వరదరాజులు, డీటీ ప్రభాకర్ ఆధ్వర్యాన తనిఖీ చేశారు. అయితే, తొమ్మిది లారీలకు అనుమతి ఉండగా, మరో మూడింటికి అనుమతులు లేవని గుర్తించి అడ్డుకున్నారు. పట్టుబడిన ఒక్కో లారీలో 200 క్వింటాళ్ల బాయిల్డ్ రైస్ ఉందని, ఈ లారీలను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే, తనిఖీల విషయాన్ని, ఎన్ని లారీలను సీజ్ చేశారనే అంశాన్ని బహిర్గతం చేయకుండా గంటల కొద్దీ రహస్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆరేళ్లకే నూరేళ్లు

ట్రాక్టర్ కదలడంతో దూకిన బాలుడి మృతి



రోహిత్ (ఫైల్)

తిరుమలాయపాలెం: ఆడుకునేందుకు ట్రాక్టర్ ఎక్కిన బాలుడు వాహనానికి ఉన్న తాళం తిప్పడంతో ముందుకు కదలగా.. భయంతో దూకి అదే ట్రాక్టర్ వెనక టైరు కింద పడి మృతి చెందిన విషాద సంఘటన మండలంలోని ముజాహిదిపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నల్లగట్టు ఉపేందర్ కుమారుడు రోహిత్(6) శనివారం ఇంటి పరిసరాల్లో ఆడుకుంటుండగా సమీపంలో నాగరాజు అనే వ్యక్తి పార్కింగ్ చేసిన ట్రాక్టర్‌పైకి ఎక్కాడు. తాళాలు దానికే ఉండడంతో తిప్పగా ట్రాక్టర్ ఒక్కసారిగా ముందుకు కదిలింది. దీంతో రోహిత్ భయపడి దూకగా అదే ట్రాక్టర్ వెనక టైరు క్రింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు తలకు తీవ్ర గాయం కాగా తిరుమలాయపాలెం సీహెచ్‌సీకి తీసుకెళ్లేలోగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. అయితే, కొద్ది రోజుల క్రితం రోహిత్ తన తండ్రి ఉపేందర్ ట్రాక్టర్‌కు ఉన్న తాళాలు తిప్పడంతో ప్రమాదం తప్పినట్లు తెలిసింది. శనివారం మరే ట్రాక్టర్ ఎక్కిన బాలుడు అదే తరహాలో తాళం తిప్పి ప్రాణాలు కోల్పోయాడు. ఈమేరకు బాలుడి మృతదేహం వద్ద తల్లిదండ్రులు చేసిన రోదనలు మిన్నంటాయి.

మద్యం మత్తులో లారీ నడిపిన డ్రైవర్

- క్లీనర్ సమాచారంతో అడ్డుకున్న పోలీసులు
- విచారిస్తుండగా పీఎస్ మెట్ల పైనుంచి దూకిన వైనం

పెనుబల్లి: మద్యం మత్తులో లారీ నడుపుతున్న డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా.. భయంతో పోలీసుస్టేషన్ భవనం పైకి ఎక్కి దూకిన వైనమిది. దీంతో గాయపడిన ఆయనకు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... ఏపీలోని జగ్గయ్యపేట సమీపాన చిల్లకల్లులో సిమెంట్ లోడ్ చేసుకుని రాజమండ్రి వెళ్తున్న లారీ డ్రైవర్ అనంతగిరికి చెందిన జీవన్‌కుమార్ శుక్రవారం సాయంత్రం వైరా సమీపాన మరో డ్రైవర్‌తో కలిసి మద్యం తాగాడు. ఆ మత్తులోనే లారీ నడుపుతుండగా సహచర డ్రైవర్లు గుర్తించి లారీ యజమాని, కోదాడకు చెందిన సైదాచారికి సమాచారం ఇచ్చారు. ఆపై కల్లూరులో మరోమారు మద్యం తాగిన జీవన్ ప్రమాదకరంగా లారీ నడుపుతుండడంతో క్లీనర్‌గా ఉన్న ముదిగొండ వాసి హరికృష్ణ బలవంతంగా ఆపి పెనుబల్లి మండలం టేకులపల్లి వద్ద కిందకు దిగాడు. ఆతర్వాత డయల్ 100 ద్వారా విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో అప్రమత్తమైన వీఎం బంజర పోలీసులు స్టేషన్ ఎదుట లారీని ఆపే ప్రయత్నం చేసినా జీవన్ ఆగలేదు. దీంతో వెంబడించి వీఎం బంజర్ సెంటర్ సమీపాన లారీని ఆపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు ఆయనను స్టేషన్‌కు తీసుకెళ్లి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా 310 పాయింట్లుగా నమోదైంది. ఈనేపథ్యాన డ్రైవర్ వివరాల కోసం లైసెన్స్, ఆధార్ కార్డు పరిశీలించగా రెండింట్లో వేర్వేరు పేర్లు ఉన్నాయి. ఇదంతా జరుగుతుండగానే ఆందోళనకు గురైన జీవన్‌కుమార్ పోలీస్ స్టేషన్ పైభాగంలో ఉన్న సీఐ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడి మెట్ల పైనుంచి కిందకు దూకాడు. అప్రమత్తమైన పోలీసులు ఆయనను పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవడంతో పెనుప్రమాదం తప్పగా, ఆయన కిందకు దూకి గాయపడడంతో మరో ప్రమాదం జరిగినట్లుయింది.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.